క్లుప్తంగా

'పరుగు' పోటీల్లో ప్రతిభ

భిక్కనూరు: సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన హాఫ్ మారథన్ పరుగు పందెంలో మండల కేంద్రానికి చెందిన క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. క్రీడాకారులు భరత్ రాజ్, శ్రీనిధి, నందిని, అఖిల్, శేఖర్, ఠాగూర్, శ్రేయస్‌లను మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అభినందించి రూ.5 వేల చొప్పున నగదు బహుమతిని అందజేశారు.

సత్తా చాటిన క్రీడాకారులు



భిక్కనూరు: హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన కరాటే జూనియర్ బెల్ట్ టెస్టులో పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన 12 మంది సత్తా చాటారని గ్రామానికి చెందిన కరాటే మాస్టర్ సాయినాథ్ గౌడ్ తెలిపారు. ఇంటర్నేషనల్ ఒకినవా గోజురాయి కరాటే ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు సాగాయని పేర్కొన్నారు.

వాహనాల తనిఖీ



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రం సమీపంలోని పెద్దవాగు వద్ద ఆదివారం ఎస్సై దీపక్ కుమార్ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాల ధ్రువపత్రాలు, లైసెన్సులు లేని వారికి హెల్మెట్, సీటు బెల్టు ధరించని వారికి మద్యం తాగి వాహనాలు నడుపున్న పలువురికి జరిమానాలు విధించినట్లు తెలిపారు. పెండింగ్ చలానాలు వసూలు చేసినట్లు తెలిపారు. మద్యం తాగి వాహనం నడుపుతున్న ఒకరిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

తెరసం శంకర్‌కు సినారె పురస్కారం



కామారెడ్డి అర్బన్: తెలంగాణ రచయితల సంఘం (తెరసం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కామారెడ్డికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్, కవి, రచయిత డాక్టర్ వి.శంకర్‌కు యాదాద్రి భువనగిరి జిల్లా సాహిత్య సంస్థల సినారె సాహితీ పురస్కారం అందుకున్నారు. ఆదివారం భువనగిరిలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి కె.లక్ష్మణ్.. సినారె పురస్కారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు నందిని సిద్ధారెడ్డి, తెలంగాణ సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి జె.చెన్నయ్య, ప్రముఖులు ఏనుగు నర్సింహారెడ్డి, పోరెడ్డి రంగయ్య, వెంకటరెడ్డి, జయశ్రీ, అన్నవరం దేవేందర్, దామెర రాములు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు స్పోర్ట్స్ ఐకానిక్ అవార్డు అందజేత



పిట్లం(జుక్కల్): హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో ఆదివారం విశ్వా ఆర్ట్స్, మన కళాక్షేత్రం ఆధ్వర్యంలో గురుపూజా మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. పిట్లంకు చెందిన క్రీడాకారిణి ప్రతిభకు స్పోర్ట్స్ ఐకానిక్ అవార్డ్ అందజేసి సన్మానించారు.

అయోధ్య యూత్ క్లబ్ కార్యవర్గం

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని దేవునిపల్లి అయోధ్య యూత్ క్లబ్ 26 వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం క్లబ్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. అధ్యక్షుడిగా పీఠం గోవర్ధన్, ఉపాధ్యక్షుడిగా లాండే సంజీవ్, కార్యదర్శిగా తుమ్మ నరేష్, కోశాధికారిగా రామారావులు ఎన్నికయ్యారు.

దేవునిపల్లి రైతు సంఘం..

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని దేవునిపల్లి గ్రామ రైతు సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వి.శివాజీ, ఉపాధ్యక్షుడిగా ఒగ్గు సతీష్, కోశాధికారిగా డి.రమేష్, సలహాదారులుగా రంజిత్, నవీన్, ఈశ్వర్, కార్యవర్గసభ్యులుగా కాసర్ల శ్రీకాంత్, రఘు, చక్రభాను, రాహుల్ ఎన్నికయ్యారు.

తాడ్వాయిలో ప్రజావాణి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): స్థానిక తహసీల్ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్వేత తెలిపారు. ప్రజలు తమ సమస్యలను ఈ ప్రజావాణిలో ఫిర్యాదులు చేసుకోవాలని ఆమె సూచించారు.

అధ్వానంగా కాలనీ రోడ్లు

- వాజిద్‌నగర్‌లో అడుగు వేస్తే. తీయలేని పరిస్థితి
- పట్టించుకోని అధికార యంత్రాంగం





బురదమయంగా ఉన్న వాజిద్ నగర్‌లోని ఇందిరమ్మ కాలనీ రోడ్లు

బిచ్కుంద(జుక్కల్): వర్షాలకు వాజిద్‌నగర్‌లో రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. కొత్తగా ఇందిరమ్మ కాలనీ ఏర్పాటై పదేళ్లు అవుతుంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు కాలనీలో కనీసం సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యారు. మట్టి రోడ్డు కావడంతో వర్షం నీరు రోడ్లపై నిలబడటంతో బురదమయంగా మారాయి. అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి ఉంది. హైస్కూల్‌కు వెళ్లాలంటే విద్యార్థులకు ఆ రోడ్డు గుండానే వెళ్లాలి. విద్యార్థులు, మహిళలు, వృద్ధులు బురదలో నుంచి వెళ్తూ నరకం అనుభవిస్తున్నారు. రాత్రి సమయంలో ఎవరికైనా ఆపద వస్తే కనీసం అంబులెన్స్ రాని పరిస్థితి నెలకొంది. చేతిలో చిల్లి గవ్వ నిధులు లేవని ప్రత్యేక అధికారులు గ్రామాల్లో చేతులెత్తేస్తున్నారు. నీటి నిర్వహణ, పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు, తాగునీటి మోటార్లకు మరమ్మతులు, నీటి క్లోరినేషన్, విద్యుత్ లైట్ల నిర్వహణ భారంగా మారిందని.. అప్పులు తీసుకొచ్చి నెట్టుకొస్తున్నామని జీపీ కార్యదర్శులు వాపోతున్నారు.

నరకం అనుభవిస్తున్నాం



ఇందిరమ్మ కాలనీలో పుట్టెడు సమస్యలున్నాయి. రోడ్డుపై నడవాలంటే నరకం అనుభవిస్తున్నాం. ప్రత్యేక అధికారులు పత్తాలేరు. జీపీ అధికారులు నిధులు లేవంటున్నారు. జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు స్పందించి ప్రత్యేక నిధులు మంజూరు చేయించి సీసీ రోడ్లు వేయాలని కోరుతున్నాం.

– గంగాధర్, వాజిద్‌నగర్

ప్రమాదకరంగా గుంతలు



నస్రుల్లాబాద్: మండల కేంద్రంలో గల 765–డి జాతీయ రహదారిపై బస్టాండ్ వద్ద గుంతలు ప్రమాదకరంగా మారాయి. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ఈ మార్గంలో వెళ్తుంటాయి. గుంతలలో పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారుల స్పందించి ప్యాచ్ వర్క్ అయినా చేసి గుంతలను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

ఘోరంగా దెబ్బతిన్న రహదారులు

మద్నూర్(జుక్కల్): ఉమ్మడి మద్నూర్, డోంగ్లీ మండలంలోని పలు గ్రామాల రహదారులు చిత్తడిగా మారి భయంకరంగా మారాయి. రోడ్లపై అడుగడుగున గుంతలు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని దోతి, మల్లాపూర్ రహదారిలో మోకాలి లోతు గుంతలు పడ్డాయి. వర్షం కురియడంతో రోడ్డుపై బురద, వరద నీరు చేరడంతో చుక్కలు కనపడుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. మండలంలోని లచ్మాపూర్, మారెపల్లి నుంచి నిత్యం ఆటోల్లో పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు సుల్తాన్‌పేట్‌కు వెళ్తారు. ఈ రహదారి పూర్తిగా బురదమయంగా మారడంతో ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని వారు కోరుతున్నారు.



దోతికి వెళ్లే రహదారిపై ఏర్పడిన గుంతలు

దళిత మహిళను వంచించిన వ్యక్తిని అరెస్ట్ చేయాలి

బాన్సువాడ రూరల్: బీర్కూర్ గ్రామానికి చెందిన దళిత మహిళను వంచించిన నర్ర సాయిలు అనే వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలని ఆదివారం బీర్కూర్‌లో దళిత సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. ఈసందర్భంగా మాల మహానాడు డివిజన్ అధ్యక్షులు మల్లూరి సాయిలు మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా మహిళతో సహజీవనం చేయడంతో కుమారుడు కలిగాడన్నారు. కొంతకాలంగా మహిళను, కుమారుడిని పట్టించుకోకపోవడంతో ఆందోళన చేపట్టగా ఇరువర్గాల మధ్య దాడులు జరిగాయన్నారు. దీంతో రాజకీయ పలుకుబడిని ఉపయోగించి నర్రసాయిలు బీర్కూర్ పోలీస్‌స్టేషన్‌లో మహిళతో పాటు వారి బంధువులపై కేసులు నమోదు చేయించారని ఆరోపించారు. అధికారులు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.



బీర్కూర్‌లో రాస్తారోకో చేస్తున్న దళిత సంఘాల నాయకులు

రజకుల అభివృద్ధికి కృషి



కామారెడ్డి టౌన్: రజకుల అభివృద్ధికి కృషి చేస్తానని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో పట్టణ రజక సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న ఈదమ్మ ఆలయానికి ఆయన రూ. 2.70 లక్షలను విరాళంగా అందజేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం మత్తడి వద్ద ఆలయ గర్భగుడి, గోపురం, స్లాబ్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయనను సన్మానించారు. సంఘం నాయకులు బండారి శ్రీకాంత్, నర్సన్న, మహేష్, కోటేశ్వర్, పండు, శ్రీకాంత్, తదితరులున్నారు.

లోక కల్యాణం కోసమే పాదయాత్ర

- మహాచార్య ప్రేమ వాత్సల్య శ్రీ కైకేయిజీ



రామారెడ్డి: లోక కల్యాణం కోసమే పాదయాత్ర నిర్వహిస్తున్నామని సిద్ధ సమాధి యోగ కేంద్ర నిర్వాహకుడు ప్రేమ వాత్సల్య శ్రీ కై కేయిజీ అన్నారు. ఆదివారం కామారెడ్డి ఆర్‌బీవీకే ఆధ్వర్యంలో ఎస్ఎస్‌వై ఆశ్రమం కామారెడ్డి నుంచి మద్దికుంట బుగ్గ రామలింగేశ్వర ఆలయం వరకు నిర్వహించిన 21 కిలోమీటర్ల పాదయాత్రలో 210 మంది పాల్గొన్నారు. కామారెడ్డి నుంచి పాదయాత్ర కాలభైరవస్వామి ఆలయానికి చేరుకున్న అనంతరం అక్కడ ధ్యానం చేసి పాదయాత్ర మద్దికుంట బుగ్గ రామలింగేశ్వర ఆలయానికి చేరుకుంది. ఆలయంలో దర్శనం అనంతరం ధ్యానం కార్యక్రమాలను నిర్వహించారు. ఆచార్యులు రాజుజీ, డాక్టర్ మురళీధర్ రాజు, శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

'రైతుల వెంట ఉండి పోరాటం చేస్తా'



పెద్దకొడప్‌గల్(జుక్కల్): సమస్యలు పరిష్కరించే వరకు రైతుల వెంట ఉండి పోరాటం చేస్తానని కాంగ్రెస్ జుక్కల్ ఎస్సీ సెల్ చైర్మన్ సౌదాగర్ అరవింద్ హామీ ఇచ్చారు. కాటేపల్లి తండా రైతులు తండా శివారులో 275, 118 సర్వే నెంబర్‌లో అటవీ భూములు కబ్జా చేసుకున్నారని ఆరోపిస్తూ భూమిలో వేసిన పంటలను అటవీ అధికారులు ధ్వంసం చేసి మొక్కలు నాటారు. అరవింద్ ఆదివారం తండాకు చేరుకొని ధ్వంసం చేసిన పంటలను పరిశీలించారు. తండా రైతులు వారి సమస్యలను ఆయనకు చెప్పుకున్నారు. రైతుల తరపున పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు.

మేమెంతో మాకంత రిజర్వేషన్ ఇవ్వాలి



గాంధారి(ఎల్లారెడ్డి): మేమెంతో మాకంత జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు అందించాలని జాతీయ లంబాడీ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు బెల్లాం నాయక్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో గిరిజనుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గిరిజనులు సాగు చేస్తున్న భూములను వారికే పట్టాలు చేసి ఇవ్వాలన్నారు. గోర్ లంబాడీ భాషను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. రాంబలనాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో చేరేందుకు అడ్మిషన్లు ప్రారంభం



ప్రిన్సిపల్ కనకయ్య

తాడ్వాయి(ఎల్లారెడ్డి): బ్రహ్మాజీవాడి శివారులో గల ఐటీఐలో చేరేందుకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ కనకయ్య తెలిపారు. తెలంగాణా ప్రభుత్వం ఉపాధి కల్పన, శిక్షణ శాఖ వారి పారిశ్రామిక శిక్షణ కేంద్రాలలో చేరేందుకు అడ్మిషన్లు ప్రారంభయ్యాయని తెలిపారు. ఈ నెలాఖరు వరకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌లలో ఉచితంగా అడ్మిషన్లు పొంది వివిధ రకాల అధునాతన పారిశ్రామిక కోర్సులలో శిక్షణ పొందుటకు 2025–26–27 విద్యా సంవత్సరానికి రెండో దశ అడ్మిషన్లకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆసక్తిగల వారు 10వ తరగతి పాసై ఉండి, 14 సంవత్సరాల పైబడి వయస్సు ఉండాలన్నారు.

సంక్షిప్తం

బహుజన అలయ్ బలయ్‌కు తరలిన నేతలు



బాన్సువాడ రూరల్: కామారెడ్డిలోని కళాభారతిలో ఆదివారం నిర్వహించిన బహుజన అలయ్–బలయ్, రాజ్యాంగ పరిరక్షణ సదస్సుకు బోర్లం నుంచి అంబేడ్కర్ సంఘం నాయకులు తరలివెళ్లారు. బహుజనుల ఐక్యత, రాజ్యాధికారం, ప్రభుత్వం తరపున అభివృద్ధి సంక్షేమం కోసం సభలో చర్చించనున్నట్లు అంబేడ్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి నర్సింహులు తెలిపారు. నాయకులు మన్నె సాయిలు, జగ్గ ఆనంద్, రాజ్‌కుమార్, కొత్తపల్లి సాయిలు, పోతరాజు సాయిలు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గర్జన సమావేశానికి..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఆయా తండాలకు చెందిన గిరిజనులు ఆదివారం గాంధారి మండల కేంద్రంలో నిర్వహించిన గిరిజన గర్జన సమావేశానికి తరలివెళ్లారు. గాంధారిలోని మారుతి ఫంక్షన్ హాల్‌లో గిరిజన ధర్మ సమాజ్ పరిరక్షణ కోసం గిరిజన గర్జన సమావేశం నిర్వహించారు. మండలంలోని పలు తండాలకు చెందిన గిరిజనులు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు.




విద్య, వైజ్ఞానిక మహాసభను విజయవంతం చేయండి



బాన్సువాడ రూరల్: తెలంగాణ స్టేట్ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్(యూటీఎఫ్) రాష్ట్ర 6వ విద్యావైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆకుల బాబు, ప్రధాన కార్యదర్శి ఎగజం సాయిలు కోరారు. ఈనెల 28 నుంచి 30 వరకు నల్గొండలో మహాసభలు ఉంటాయన్నారు. 3 రోజుల పాటు జరిగే మహాసభలను విజయవంతం చేయాలని వారు కోరారు. నేతలు ఎ.సాయిలు, టి.సుధాకర్, వై. గోపాల్, బ్రహ్మానందం, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ తెలంగాణ ప్రాంత సమావేశాల్లో జిల్లా నేతలు



కామారెడ్డి అర్బన్: యాదగిరిగుట్టలో నిర్వహిస్తున్న విశ్వహిందూ పరిషత్ తెలంగాణ ప్రాంత వర్షాకాల సమావేశాల్లో కామారెడ్డి జిల్లా నేతలు పాల్గొన్నారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు ఎ.నిత్యానందం, ప్రధాన కార్యదర్శి బొల్లిరాజు, సహ కార్యదర్శులు ఏనుగు రాజు, గంగాధర్, కోశాధ్యక్షులు అమ్మల శ్రీనివాస్, త్రికండా సంఘటన మంత్రి వినోద్‌కుమార్ తదితరులు పాల్గొంటున్నారు. వీహెచ్‌పీ అఖిల భారతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి కోటేశ్వరశర్మ భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాల గురించి వివరించినట్లు జిల్లా అధ్యక్షుడు నిత్యానందం తెలిపారు.

పెరుగుతున్న కోతుల బెడద

- ఇళ్ల పైకప్పులను తొలగిస్తున్న వానర సైన్యం
- అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల వినతి



రాజంపేటలో ఓ ఇంటి పైకప్పును తొలగిస్తున్న కోతులు

రాజంపేట: మండల కేంద్రంలో రోజురోజుకు కోతుల బెడద పెరిగిపోతోంది. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి రోజూ ఇళ్లపైకి వానర సైన్యం ఎక్కి పెంకులను ధ్వంసం చేస్తూ బీభత్సాన్ని సృష్టిస్తున్నాయి. అలాగే ఇళ్లలోకి చొరబడి వస్తువులను చిందరవందర చేస్తూ ధ్వంసం చేయడమే కాకుండా మనుషులపై దాడులకు పాల్పడుతున్నాయి. అధికారులు స్పందించి ఈ కోతుల బెడద నుంచి తమను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం



బాన్సువాడ రూరల్: చిన్నరాంపూర్‌లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. గ్రామ పంచాయతీల్లో నిధుల కొరత మూలంగా పనులు ముందుకు సాగడం లేదు. పంచాయతీ సిబ్బందికి ప్రతినెలా సక్రమంగా జీతాలు ఇవ్వలేని పరిస్థితులు నెలకొన్నాయి. ట్రాక్టర్‌తో చెత్తాచెదారం ఎత్తి డంపింగ్‌యార్డులకు తరలించాల్సి ఉండగా ఎక్కడి చెత్తకుప్పలు అక్కడే దర్శనమిస్తున్నాయి. వర్షాకాలం కావడంతో దుర్వాసన వెదజల్లుతోందని గ్రామస్తులు వాపోతున్నారు. ట్రాక్టర్‌తో చెత్తాచెదారాన్ని డంపింగ్‌యార్డుకు తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇలా ఉంటే రోగాలు రావా..?



రామారెడ్డి: అసలే వ్యాధుల కాలం. ఓ వైపు డెంగీ కేసులు నమోదవుతుండగా అధికారులు మత్తు వీడడం లేదు. జీపీలో నిధుల కొరతనా లేక, విధులు నిర్వహించడంలో నిర్లక్ష్యమా.. కారణమేదైనా దాని ప్రభావం మాత్రం ప్రజలపై పడుతోంది. పోసానిపేట గ్రామంలోని నీటి తొట్టెలను ప్రజల వివిధ అవసరాలకు వినియోగించుకుంటారు. నల్లా ద్వారా వచ్చిన నీటిపై నాచు పేరుకుపోయింది. అధికారులు స్పందించి తొట్టెలను శుభ్రం చేయించి ప్రజలను వ్యాధుల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

దోమకొండ: సీఎం రేవంత్ రెడ్డిపై ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కౌశిక్‌రెడ్డి అసెంబ్లీకి రాకుండా స్పీకర్ చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. బహిరంగంగా రేవంత్‌రెడ్డికి క్షమాపణ చెప్పి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని కోరారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కౌశిక్ రెడ్డిపై ఫిర్యాదు చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, సీడీసీ మాజీ చైర్మన్ ఐరేని నర్సయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్రబోయిన స్వామి, మాజీ జెడ్పీటీసీ తిరుమల్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు సీతారామ మధు, జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, నాయకులు రామస్వామిగౌడ్, నల్లపు శ్రీనివాస్, శంకర్ రెడ్డి, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

ఆధ్యాత్మికం

ఘనంగా శనీశ్వరుడి విగ్రహ ప్రతిష్ఠాపన



కామారెడ్డి అర్బన్: శని శింగనాపురం కృష్ణ శిల శని దేవుడిని కామారెడ్డి పట్టణంలో ప్రతిష్ఠ చేయడం భక్తులకు ఎంతో మేలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక లిటిల్ స్కాలర్స్ పాఠశాల సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీవైద్యనాథ ముక్తి క్షేత్రం ప్రాంగణంలో శ్రీశనీశ్వరుడి ప్రతిష్ఠాపన ఉత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించి తైలాభిషేకం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వేద పండితులు, అర్చకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జై హనుమాన్ యోగా కేంద్రం కృషి అభినందనీయం



కామారెడ్డి అర్బన్: జైహనుమాన్ యోగా కేంద్రం యోగా, వైదిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో విశేష కృషి చేయడం అభినందనీయమని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. ఆదివారం నిర్వహించిన స్థానిక రాంమందిర్ జై హనుమాన్ యోగా కేంద్రం 15వ వార్షికోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వైదిక యజ్ఞం నిర్వహించారు. అంకాపూర్ వైదిక యోగాశ్రమం స్వామిజీ సదానంద భారతి, యోగాచార్యులు గరపల్లి అంజయ్యగుప్తా, యెల్లంకి సుదర్శన్, యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి.రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఆలయం శుభ్రం

కామారెడ్డి అర్బన్: స్థానిక రాజానగర్ కాలనీలోని అంజనేయస్వామి ఆలయాన్ని బజరంగ్‌దళ్ కార్యకర్తలు స్థానిక భక్తులతో కలిసి శుభ్రం చేశారు. బజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ వివేకానంద అశోక్, నగర సంయోజక్ దుబ్బాక రమేష్, నగర బలోపాసన ప్రముఖ్ శివ, ప్రతినిధులు విష్ణు, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రుద్రాభిషేకం

భిక్కనూరు: మండల కేంద్రంలోని వేంకటేశ్వరాలయంలో శ్రావణమాస ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఆలయంలోని శివాలయంలో స్వామి వారికి ఆదివారం రుద్రాభిషేకం చేశారు.

హనుమాన్ ఆలయంలో పూజలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భరత్ రావు, సంజీవులు, దత్తాత్రేయ, సిద్ధిరాంరెడ్డి, రాజాగౌడ్, రాంచంద్రం, గోపాల్‌రావు, లక్ష్మణ్, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



మాచారెడ్డి: చుక్కాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ అభివృద్ధి కోసం కామారెడ్డి పట్టణానికి చెందిన బొందుగులపాటి పాండురంగారావు, సరస్వతి దంపతులు ఆదివారం రూ.10 వేలు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు స్వామివారి చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు. జూనియర్ అసిస్టెంట్ సంతోష్‌కుమార్, అర్చకులు నర్సింహాచార్యులు ఉన్నారు.

అబ్దుల్ కలామ్‌కు ఘన నివాళులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్ ఎల్లారెడ్డిలో ఆదివారం ఏపీజే అబ్దుల్ కలామ్ వర్ధంతిని సమాచార హక్కు చట్టం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆర్టీఐ ప్రతినిధులు నితిన్ గౌడ్, అలీమొద్దీన్, షకీల్, శ్రీనివాస్, రాములు, రంగ మోహన్, ఆంజనేయులు, సంజీవ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

